క్లుప్తంగా

వైభవంగా తలుపులమ్మ తల్లి పండగ



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

కోటవురట్ల : కె.తంగేడు గ్రామంలో తలుపులమ్మ తల్లి పండగను మంగళవారం వైభవంగా జరిపారు. గ్రామ శివారున చెరకు కాటా సమీపంలో ఉన్న తలుపులమ్మతల్లి ఆలయంలో భక్తులు అమ్మవారికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఆర్.ఎస్.సీతారామరాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆర్.ఎస్. రామచంద్రరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు సత్యనారాయణరాజు, లక్ష్మీ నరసింహరాజు పాల్గొన్నారు.

ఘనంగా గణపతి ఆలయ వార్షికోత్సవం



గణపతి ఆలయంలో పూజలు

నక్కపల్లి : మండల కేంద్రంలోని రాజీవ్‌నగర్ కాలనీలో గణపతి ఆలయ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు, నిర్వాహకులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతి హోమం జరిగింది. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయంలో అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

వాడపాలెంలో గడప గడపకు నేడు

రాంబిల్లి: రాంబిల్లి సచివాలయం పరిధిలో గల వాడపాలెంలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఎంపీపీ జి.శిరీషశ్రీనుబాబు తెలిపారు. ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు(కన్నబాబు) ఉదయం 6గంటలకు ప్రారంభించే ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

1 నుంచి ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ

అచ్యుతాపురం(అనకాపల్లి): స్థానిక ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాలలో భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో జూన్ 1వ తేదీ నుంచి ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఏడాది పాటు ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇవ్వనున్నట్లు కళాశాల యాజమాన్యం మంగళవారం పేర్కొంది. 18 నుంచి 30 సంవత్సరాల లోపు మధ్య వయస్సు గల వారు ఈ శిక్షణకు అర్హులని తెలిపింది. శిక్షణకు ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.1000 స్టైఫండ్ ఇవ్వనున్నట్టు తెలిపారు. మరిన్ని వివరాలకు 9701241753 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఎల్ఐసీని నిర్వీర్యం చేసేందుకే ఐపీవో



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న శంకరరావు, సైదునాయుడు, ఏజెంట్లు

అనకాపల్లిటౌన్ : కేంద్రం ఐపీవో పేరిట ఎల్ఐసీని ప్రైవేటుపరం చేయాలని చూస్తోందని ఎల్ఐసీ యూనియన్ అధ్యక్షుడు గొర్లె శంకరరావు అన్నారు. స్థానిక ఎల్ఐసీ కార్యాలయం ఎదుట మంగళవారం 6వ అఖిల భారత మహాసభల గోడపత్రికను ఆయన ఆవిష్కరించారు. కేంద్రం తీసుకున్న నిర్ణయంతో ఎల్ఐసీ ఏజెంట్ల భవిష్యత్ ఆందోళనకరంగా మారిందన్నారు. విశాఖలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 22, 23 తేదీల్లో ఎల్ఐసీ ఏజెంట్ల ఆర్గనైజేషన్ మహాసభలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ప్రభుత్వ రంగసంస్థలను ఇరకాటంలో పెట్టేలా కేంద్రం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఏజెంట్ల వ్యవస్థని, ఎల్ఐసీని రక్షించుకోవడానికి భవిష్యత్ కార్యాచరణ రూపొందించేందుకు ఈ మహాసభను ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. కార్యక్రమంలో స్థానిక బ్రాంచ్ అధ్యక్షుడు పెంటకోట సైదునాయుడు, ఏజెంట్లు ఎన్.అప్పారావు, పీలా శ్రీనివాసరావు, రొంగలి వెంకటరావు పాల్గొన్నారు.

డెంగ్యూను నిర్మూలిద్దాం



యలమంచిలిలో ర్యాలీ చేస్తున్న మున్సిపల్, అటవీశాఖ, మెప్మా అధికారులు



గుడ్డ సంచుల వినియోగంపై ప్రచారం చేస్తున్న మున్సిపల్ కమిషనర్ కృష్ణవేణి, అధికారులు



చూచుకొండలో ర్యాలీ



నక్కపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



పెనుగొల్లు పీహెచ్‌సీలో ర్యాలీ చేస్తున్న సిబ్బంది

యలమంచిలి : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ తోట కృష్ణవేణి అన్నారు. పర్యావరణ పరిరక్షణ వేడుకల్లో భాగంగా యలమంచిలి ఫారెస్ట్ అధికారులు, మున్సిపల్ అధికారులు కలసి యలమంచిలి పట్టణంలో పర్యావరణంపై అవగహన ర్యాలీ చేపట్టారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి పట్టణంలో వైయస్సార్ కూడలి వరకు ప్లాస్టిక్ నిషేధం, పరిసరాల పరిశుభ్రత, పచ్చదనం, ఆరోగ్య సంరక్షణపై అవగహన కల్పించారు. అలాగే ప్రపంచ డెంగ్యూ నివారణ దినోత్సవం సందర్భంగా ర్యాలీని మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ప్లాస్టిక్ వ్యర్థాలను నివారించాలని, గుడ్డ సంచులు విధిగా వాడాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, డెంగ్యూ వ్యాధి బారిన పడకుండా జాగ్రత్తలు వహించాలని సూచించారు. ప్లాస్టిక్ వ్యర్థాలు, రుబ్బురోళ్లు, ఖాళీ కొబ్బరి బొండాలు వంటి వాటిలో డెంగ్యూ దోమలు వ్యాప్తి చెందకుండా ఎప్పటికప్పుడు దోమల మందులు పిచికారీ చేయాలన్నారు. యలమంచిలి పట్టణంలో వై.ఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద మానవ హారంగా ఏర్పడి ప్లాస్టిక్ నిషేధంపై నినాదాలు, ప్లకార్డులతో ప్రదర్శించారు. మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు, మెప్మా సీపీఎం పద్మ, మున్సిపల్ శానిటేషన్ సిబ్బంది, అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

నక్కపల్లిలో డెంగ్యూపై అవగాహన ర్యాలీ

నక్కపల్లి : మండల కేంద్రంలో మంగళవారం డెంగ్యూ నివారణపై అవగాహన ర్యాలీ జరిగింది. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో సీతారామరాజు, గొడిచర్ల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కిషోర్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది, మండల పరిషత్ సిబ్బంది, కార్యదర్శులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. గ్రామాల్లో పారిశుధ్య సమస్యల కారణంగా వైరల్ జ్వరాలు వస్తున్నాయన్నారు. నిల్వ పదార్థాలు తినరాదని, కాచి చల్లార్చిన నీటినే తాగాలని ఎంపీడీవో తెలిపారు. జ్వర లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలో ఉన్న పీహెచ్‌సీకి వెళ్లి చూపించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ వెంకటనారాయణ, ఏఎన్ఎంలు, కార్యదర్శులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మునగపాక : ప్రతి ఒక్కరూ డెంగ్యూ పట్ల అప్రమత్తంగా ఉండాలని చూచుకొండ, మునగపాక పీహెచ్‌సీ వైద్యాధికారులు వినోద్, అనిల్‌కుమార్ కోరారు. జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవ సందర్భంగా మంగళవారం చూచుకొండ, మునగపాక తదితర ప్రాంతాల్లో ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇళ్ల వద్ద నిల్వ నీరు లేకుండా చూడాలన్నారు. నిల్వనీటిలో దోమలు వృద్ధి చెంది డెంగ్యూకు కారణమవుతుందన్నారు. అలాగే డెంగ్యూ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచ్ దిమ్మల అప్పారావు, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, ఆరోగ్య సహాయకులు శరగడం నాయుడు, మహేష్, సీహెచ్‌వో దేవకాంత, ఏఎన్ఎం దేవకి, ఎంపీడీవో రవికుమార్ పాల్గొన్నారు.

ఎస్.రాయవరం: నిల్వ నీటిలో డెంగ్యూ దోమలు పెరిగి ఆ వ్యాధికి కారణమవుతాయని పెనుగొల్లు పీహెచ్‌సీ వైద్యాధికారి జమీమారాణి అన్నారు. జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం సందర్భంగా పెనుగొల్లు, సర్వసిద్ధి పీహెచ్‌సీల పరిధిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పీహెచ్‌సీల వైద్యాధికారులు మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధిపై కల్పించారు. ఇళ్ల వద్ద నిల్వ నీటిపై జాగ్రత్తలు తీసుకునేలా చూసుకోవాలన్నారు. ఈ వ్యాధి సోకిన వారు లక్షణాలు తెలుసుకుని వైద్యులను సంప్రదించాలన్నారు.

అచ్యుతాపురం(అనకాపల్లి): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం జరిగింది. ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఏఎన్ఎంలు చేయి చేయి కలుపుదాం..డెంగ్యూను నివారిద్దాం అంటూ రహదారి మీదుగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి బి.అలేఖ్య మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీటినిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 12 సచివాలయాల సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన నేస్తాలు



కోటవురట్ల శాఖా గ్రంథాలయంలో కథ చెబుతున్న విద్యార్థిని



తాము గీసిన చిత్రాలను చూపిస్తున్న చిన్నారులు

కోటవురట్ల : గ్రంథాలయాలు విజ్ఞానాన్ని అందించే నేస్తాలని గ్రంథాలయాధికారి అప్పలనాయుడు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో మంగళవారం వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులతో పుస్తక పఠనం, కథలు, పద్యాలు చెప్పడంపై సాధన చేయించారు. గ్రంథాలయాధికారి మాట్లాడుతూ సెలవుల్లో విద్యార్థులు చదువుపై ఆసక్తిని పెంచుకునేలా విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. విద్యార్థులు సెల్ ఫోన్లకు దూరంగా ఉండి విజ్ఞానాన్ని అందించే పుస్తకాలతో కాలక్షేపం చేయడం మేలన్నారు.

చిత్రలేఖనంపై అవగాహన

రాంబిల్లి : దిమిలి శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ బుధవారం కొనసాగింది. చిత్రలేఖనంపై అవగాహన కల్పించారు. విద్యార్థులు ఉత్సాహంగా చిత్రాలు గీసి వాటిని ప్రదర్శించారు. అనంతరం కథలు చెప్పడం, చదవడం నేర్పించారు. లైబ్రేరియన్ శకుంతల పాల్గొన్నారు.

తెలుగుపదాలపై వేసవి విజ్ఞాన తరగతులు

అచ్యుతాపురం(అనకాపల్లి): స్థానిక గ్రంథాలయంలో 9వ రోజైన మంగళవారం వేసవి విజ్ఞాన తరగతులు జరిగాయి. తెలుగు పదాలలో అచ్చులు, హల్లులతో కూడుకున్న పదాలను వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి డి.కోటేశ్వరరావు, 30 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి మత్స్యకారుల క్షీరాభిషేకం



సీఎం జగన్ చిత్రటానికి క్షీరాభిషేకం చేస్తున్న మత్స్యకారులు

పాయకరావుపేట : మండలంలో గల వెంకటనగరం గ్రామంలో పలువురు మత్స్యకారులు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. చేపలవేట నిషేధ సమయంలో మత్స్యకారులకు చేసే ఆర్థిక సాయం మత్స్యకార భరోసాను మంగళవారం ప్రభుత్వం లబ్ధిదారుల బ్యాంకు ఖాతాకు రూ.10 వేలు చొప్పున జమ చేయడంతో మత్స్యకారులు ఆనందం వ్యక్తం చేశారు. గ్రామంలో గల వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ చెడిపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు మత్స్యకారులు పాల్గొన్నారు.

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం



డీఎస్పీ సత్యనారాయణను సత్కరిస్తున్న క్లబ్ సభ్యులు

అచ్యుతాపురం(అనకాపల్లి): క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని డీఎస్పీ కె.వి.సత్యనారాయణ అన్నారు. మండలంలో నునపర్తి శ్రీరామ బాల్‌బ్యాడ్మింటన్ క్లబ్ ప్రాంగణంలో మంగళవారం వేసవిశిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత క్రీడలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంతకుముందు క్లబ్ సభ్యులు డీఎస్పీని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు గొంప నరసింహనాయుడు, ప్రధాన కార్యదర్శి మానవరపు అప్పారావు, సభ్యులు రెడ్డి కన్నమనాయుడు, పైడంనాయుడు, డి.శ్రీను, రమేష్ , క్రీడాకారులు పాల్గొన్నారు.

స్పోకెన్ ఇంగ్లిష్‌పై శిక్షణ

కశింకోట : స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్, గ్రామర్‌పై శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఉపాధ్యాయుడు సూరా శ్రీనివాస్ ఆంగ్లంపై మెలకువల్ని బోధించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి కె.వి.వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సిరిమల్లె నవ్వింది





- మండే ఎండల్లో మల్లెల గుబాళింపు
- శుభాకార్యాల వేళ మల్లెకు మంచి గిరాకీ
- కేజీ మల్లెల ధర రూ.1000–1200
- అనకాపల్లి మార్కెట్‌లో విరివిగా మల్లెలు

మల్లెపూలు.. మగువలు విడదీయరాని అనుబంధం. శుభకార్యమైనా, ఎక్కడికైనా ప్రయాణమైనా కొప్పున మల్లెలు కొలువుదీరాల్సిందే. ఫంక్షన్ హాళ్లయితే.. మల్లెల మాలలతో తోరణాలు తప్పనిసరి. వివాహ కార్యక్రమాల్లో వధువు జడ నిండా మల్లెతోట విరబూయక తప్పదు. మల్లెల గుబాళింపునకు, మండు వేసవే సరైన సీజన్. ఇదే సమయంలో వివాహాది శుభకార్యాలు కూడా తోడవడంతో మల్లెపూల మారాజులైన రైతులకు సిరుల పంట కురుస్తోంది.

తుమ్మపాల : మండే ఎండల్లో మల్లెపూలు గుబాళిస్తున్నాయి. ఎండలతోపాటు, శుభాకార్యాలు కూడా ఎక్కువగా ఉండటంతో మల్లెపూలకు మంచి గిరాకీ ఏర్పడింది. ఏటా మల్లెపూల ఉత్పత్తి మార్చి నుంచి జూన్ వరకు అధికంగా ఉంటుంది. వర్షాలకు తెగుళ్ల సోకిన మల్లె తోటలు, తాజా ఎండలకు విరగబూస్తున్నాయి.

మార్కెట్‌లో మల్లెలు

గ్రామీణ వాణిజ్య పట్టణంగా పేరొందిన అనకాపల్లిలో పూల మార్కెట్‌కు రద్దీ ఎక్కువ. ఇటీవల కాలంలో ఉద్యాన పంటలతో పాటు పూల సాగు వైపు గ్రామీణ రైతులు మక్కువ చూపుతున్నారు. మల్లె, గుళాబీ, కనకాంబరం, బంతి, చామంతి వంటి పూదోటల్ని సాగు చేస్తున్నారు. ప్రస్తుతం మండుతున్న ఎండలు మల్లె తోటలకు అనువైన వాతావరణం. దీంతో మల్లెపూలు అనకాపల్లి మార్కెట్‌లో విరివిగా దర్శనమిస్తున్నాయి. ఒకప్పుడు కిలో రూ.250కి కూడా దొరికిన మల్లెపూలు ప్రస్తుతం రూ.1200 వరకు ధర పలుకుతున్నాయి.

పెళ్లిళ్లతో పెరిగిన డిమాండ్

పెళ్లిళ్లు, శుభకార్యాల్లో మల్లె పూలదే అగ్రస్థానం అంటే అతిశయోక్తి కాదు. మల్లెల సువాసన వేదికల్ని ముంచెత్తుతాయి. ప్రస్తుత ధరల నేపథ్యంలో అంత భారీ దండలు వినియోగించలేని వారు కూడా.. వధువు జడను మల్లెలతో ముంచెత్తడంతోపాటు, మహిళల కొప్పుల్లో మూర మల్లెపూలైనా ఒదిగి ఉండాల్సిందే. ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ జోరుగా కొనసాగుతోంది. ఈ నెల తొలి వారం నుంచి పూలకు డిమాండ్ పెరిగింది. దీంతో ఈ నెల్లో కిలో రూ.450 నుంచి మొదలైన అమ్మకాలు రూ.1200 వరకు చేరుకున్నట్టు రైతులు ఆనందంగా చెప్తున్నారు.

సుగంధాల తయారీలో కీలకం

సుగంధాల తయారీలో కూడా మల్లెల్ని విరివిగా ఉపయోగిస్తారు. ప్రతి ఏటా మార్చి నుంచి ప్రారంభమయ్యే మల్లె తోటలు జూన్ వరకు అత్యధిక దిగుబడిని ఇస్తాయి. ఈ సీజన్‌లో మల్లెపూలను అధికంగా కొనుగోలు చేసి సౌందర్య సాధనాల తయారీకి వినియోగిస్తారు. సబ్బులు, నూనెలు, అగరొత్తులు వంటి సుగంధ ద్రవ్యాల తయారీలో ఇవి కీలకం. జుట్టు రాలడం, చుండ్రు వంటి సమస్యలకు కూడా మల్లెపూల పొడిని పలు దినుసులతో కలిపి వాడుతారు.

రోజుకో ధర

మల్లెపూల ధర స్టాక్ మార్కెట్‌ను తలపించేలా మారుతోంది. ఒక్కో రోజు ఒక్కో ధర పలుకుతోంది. శుభాకార్యాలున్న రోజుల్లో కిలో రూ.వెయ్యి నుంచి రూ.1200 మధ్య పలుకుతుంది. మిగిలిన రోజుల్లో రూ.500కు అటూఇటుగా మాత్రమే ఉంటోంది. దీంతో మల్లెపూల సాగు రైతులు, పూల వ్యాపారుల పరిస్థితి అయితే అతివృష్టి లేకుంటే అనావృష్టి మాదిరిగా ఉంటోంది.

రోజుకో ధర మారుతుంది



మల్లెపూల ఉత్పత్తి ఈ సీజన్‌లోనే అధికంగా ఉంటుంది. గిరాకీ కూడా రోజు రోజుకూ మారుతుంటుంది. శుభ కార్యాలు అధికంగా ఉన్న రోజుల్లో కేజీ మల్లెల ధర రూ.1200 పలికింది. సాధారణ రోజుల్లో రూ.250 కూడా విక్రయించాల్సి వచ్చింది. శుభ కార్యాల్లో మల్లెపూలపై మహిళలు ఎక్కువ ఆసక్తి చూపుతారు.

– తాతపూడి లక్ష్మణరావు, పూలవ్యాపారి, అనకాపల్లి

జగనన్న పాలనలో ఇంటింటా ఆనందం

ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు



రాంబిల్లిలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

రాంబిల్లి : జగనన్న సంక్షేమ పాలనలో ఇంటింటా ఆనందం నెలకొందని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు(కన్నబాబు) అన్నారు. రాంబిల్లి సచివాలయం పరిధిలో గల రాంబిల్లి, కుండలదేవునిపాలెం, యాతపేట, రెల్లివీధిలో ఆయన మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అలాగే ఆయా గ్రామంలో వున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మురుగు కాలువల నిర్మాణాలకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. దేశంలో ఎక్కడా లేని సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న జగనన్నకు అండగా వుండాలన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి జగనన్నను ఆశీర్వదించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, ఎంపీపీ జి.శిరీషశ్రీనుబాబు, జెడ్పీటీసీ ధూళి నాగరాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పిన్నంరాజు కిషోర్, మండల సచివాలయ కన్వీనర్ కొవిరి రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు డీఎస్ఎన్ రాజు(బుజ్జి), ఎంపీడీవో కె.ఎస్. కొండలరావు, తహసీల్దార్ పి.భాగ్యవతి పాల్గొన్నారు.

భానుడి ప్రతాపానికి రోడ్లు ఖాళీ



నిర్మానుష్యంగా ఉన్న కోటవురట్ల మెయిన్‌రోడ్డు



నిర్మానుష్యంగా కనిపిస్తున్న అద్దురోడ్డు

కోటవురట్ల : భానుడి ప్రతాపానికి జనం ఉక్కిరిబిక్కిరయ్యారు. ఉదయం 9 గంటల నుంచే సూరీడు రెచ్చిపోయాడు. నిప్పులు చెరగడంతో జనం ఇళ్లకే పరిమితమయ్యారు. 11 గంటలకే రహదారులన్నీ ఖాళీ అయ్యాయి. మధ్యాహ్నం 12 గంటలకు 41 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావడంతో తీవ్ర వడగాడ్పులు వీచాయి. మరో రెండు రోజుల పాటు ఎండ తీవ్రత, వడగాడ్పులు తప్పవని ఏపీ విపత్తుల సంస్థ హెచ్చరిస్తోంది. బయట తిరిగేవారు నెత్తిన టోపీ లేదా రుమాలు ధరించాలని, ఎక్కువగా మంచినీళ్లు, నిమ్మరసం, మజ్జిగ, గ్లూకోజు తీసుకోవాలని సూచిస్తోంది.

ఎస్.రాయవరం : మండలంలో మంగళవారం భానుడు భగ భగ మన్నారు. ఉదయం 9 గంటలకే ఎండ వేడిమి పెరిగింది. ఎండ తీవ్రతతో పాటు, వడగాడ్పులు సాయంత్రం వరకు వీస్తునే ఉన్నాయి. సుమారు 40 డిగ్రీల ఉష్ణోగ్రత వేడి పెరగడంతో, ఇళ్లలో ఉన్నవారు సహితం ఇబ్బందులు పడ్డారు. దీంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి.

సైబర్ మోసాలపై మహిళలు అప్రమత్తంగా ఉండాలి



మునగపాకలో మహిళలు ఎదుర్కొంటున్న మోసాలపై టీవీల ద్వారా ప్రచారం చేస్తున్న దృశ్యం

మునగపాక : మహిళలు మోసాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి కోరారు. నేరాల నియంత్రణపై ప్రభుత్వాలు తగు చర్యలు తీసుకుంటున్నాయన్నారు. మంగళవారం మునగపాక పరదేశమ్మతల్లి గుడి వద్ద ఉపాధిహామీ పథకం కూలీలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ముఖ్యంగా ఏటీఎంలు వినియోగించేటపుడు, అలాగే ఓటీపీ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సైబర్ మోసాలు పెరిగిపోతున్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే దిశ యాప్‌పై అవగాహన పెంచుకోవాలన్నారు. మహిళలు తీవ్రంగా మోసపోతున్న వైనాన్ని వీడియో ద్వారా వివరించారు. మహిళా పోలీసులు వరలక్ష్మి, శ్రావణి సంయుక్త నిర్వహణలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, సర్పంచ్ దిమ్మల అప్పారావు పాల్గొన్నారు.

75 మందికి ఉచిత కంటి పరీక్షలు



కొరుప్రోలులో నిర్వహిస్తున్న వైఎస్సార్ కంటి వెలుగు వైద్యశిబిరం

ఎస్.రాయవరం : ప్రతి ఒక్కరూ మెరుగైన కంటి చూపు కలిగి ఉండాలని ప్రభుత్వం గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తోందని కంటి వైద్య నిపుణులు వెంకటరావు అన్నారు. కొరుప్రోలు సచివాలయంలో వైఎస్సార్ కంటి వెలుగు వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి 75 మంది రోగులు హాజరయ్యారు. ఇందులో 17 మందికి శస్త్ర చికిత్సలు నిమిత్తం విశాఖపట్నం తీసుకువెళతామని చెప్పారు. వైద్య శిబిరానికి వచ్చిన వారికి కంటి పరీక్షలు నిర్వహించి అవసరమయిన మందులు అందజేశారు. శస్త్ర చికిత్సకి వెళ్లే సోమవారం పెనుగొల్లు పీహెచ్‌సీ నుంచి తీసుకువెళతామన్నారు. ఈ కార్యక్రమంలో వెల్‌నెస్ సెంటర్ సిబ్బంది, ఆశా వర్కర్లు ఉన్నారు.

తహసీల్దార్ కార్యాలయానికి మరమ్మతులు



మునగపాక తహసీల్దార్ కార్యాలయానికి మరమ్మతులు

మునగపాక : అసిస్టెంట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి చొరవతో స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి మరమ్మతులు చేపడుతున్నారు. మునగపాక తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు గురికావడంతో కార్యాలయ ఉద్యోగులతో పాటు పలు పనులపై వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పలు చోట్ల స్లాబ్ పెచ్చులూడిపోవడంతో ఎపుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన నడుమ విధులు నిర్వహిస్తున్నారు. సమస్య గుర్తించిన అసిస్టెంట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి వెంటనే పరిష్కారానికి చొరవ చూపారు. ప్రస్తుతం మరమ్మతు పనులు చురుగ్గా సాగుతున్నాయి. పలు చోట్ల ప్లాస్టింగ్‌లతో పాటు శిథిలమైన పిల్లర్లను మెరుగుపరిచేలా చర్యలు తీసుకున్నారు. దీంతో ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆరోగ్యవంతమైన సమాజానికి ఆయుర్వేదం

- ఈ నెల 20 నుంచి కోడూరులో ఆయుర్వేదంపై అవగాహన

అనకాపల్లిటౌన్ : మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంటుందని, ప్రతి వ్యక్తి ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఆయుర్వేద వైద్యులు సుందర రాజపెరుమాళ్లు అన్నారు. మండలంలోని కోడూరు గ్రామంలో ఆరోగ్యధాత్రి ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 20 నుంచి ఆయుర్వేదంలో ఏడవ సప్తాహం ప్రారంభించనున్నట్టు తెలిపారు. ఇందులో పాల్గొనే వ్యక్తులు ముందుగా రూ.వెయ్యి చెల్లించాలని, వారం రోజుల శిక్షణ అనంతరం నగదు తిరిగి ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. ఉత్కృష్టమైన హఠ యోగ సాధనకులు, యోగాచార్యులు రామలింగ వెంకట సత్యనారాయణచే అతి ప్రాచీనమైన అష్టాంగ యోగ సాధన, ఆయుర్వేద జీవన విధానాన్ని శిక్షణలో పాల్గొన్నవారికి అందించనున్నట్టు వెల్లడించారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే ధ్యేయంగా ఆయుర్వేదం ఉద్భవించిందన్నారు. ఆరోగ్యం కాపాడుకోవడానికి సులువైన సూక్ష్మమైన వ్యాయామం నుంచి అతి క్లిష్టమైన ఆసనాల వరకూ నిరంతరం సాధన చేయించనున్నట్టు పేర్కొన్నారు.